# "నేను పోనే-"

[కథ]

= శ్రీ రుక్మిణీనాథ్ =

తెలతెలవారుతోంది. తల్లి వొచ్చి లేపకుండానే నాగభూషి లేచాడు. కళ్లు నులుముకున్నాడు. అరిచేతిలో 'శ్రీరామ' వ్రాసుకున్నాడు. కళ్లనద్దుకున్నాడు. 'అమ్మా!' అన్నాడు. అమ్మ పలకలేదు. నెమ్మదిగా లేచాడు. చాప చుట్టచుట్టాడు. లోపలికి వెళ్లి పెట్టాడు. తల్లి ఎదురైంది.

"అప్పుడే లేచావేరా, పిచ్చిసన్యాసీ!"

సీతమ్మకూ ఇదిగానే ఉంది.

"నిద్దరపట్టలేదే అమ్మా! తెల్లార్లూ ఒకటే కలలే అమ్మా, బళ్లోకెళ్లినట్టూ, పరీక్షలయినట్టూ, ఫట్టున ప్యాసయినట్టూ కలలే" అన్నాడు నాగభూషి.

సీతమ్మ కొడుకుకేసి చూసింది. తన పనిలో మునిగింది. నాగభూషి లేచి వచ్చాడు. తెల్లవారుతూంది. తల్లి రోటిదగ్గిరకూచుని పచ్చడి చేస్తూంది.

"నీకేమన్నా సాయితా చెయ్యనా అమ్మా?"

సీతమ్మకు నవ్వు వొచ్చింది.

"ఏమమ్మా నవ్వుతావు? నేనేం చెయ్యలేనా"

"పనేం లేదులేరా నాన్నా."

రెండునొక్కులు నొక్కేటప్పటికి పచ్చడి అయిపోయింది. రాచ్చిప్పలోకి పచ్చడి తీసుకుని, రోట్లో యిన్ని నీళ్లు పోసి ఆమె యింట్లోకి వెళ్లింది.

ఆమెకూ అప్పుడు సంతోషంగా ఉంది. పసినాపకు వడసారం పదేళ్లు నిండాయో లేదో, సాయితా వొస్తానంటున్నాడు. ఇచ్చిన దేముడు మర్చిపోవాలి. వీడు నాలుక్కాలాలపాటు క్షేమంగా ఉండాలి.

తగని అల్లరివెధవ. ఎప్పుడూ ప్రాణాలు వీడిమీదే. తను ఏం చేస్తున్నా, పంచప్రాణాలూ వీడిమీదే ఉంటై. చదువుకోరాదుట్రా అనగూడదు. వొచ్చేసిందంటాడు. ఏం వొస్తుందో ఏమో. వీడి అల్లరితో తను కిందా మీదా పడుతోంది. బస్తీ కెట్లా వెళతాడో, ఎల్లా చదువుతాడో...క్షణం జడురాలయింది.

నాగభూషి ఉయ్యాలతొట్లో గిలక్కాయలు చూచి ఆనందిస్తూ, 'ఛీ' అంటే బోసినవ్వులు నవ్వే రోజుల్లో ఆమె భర్త గతించాడు. పోతూపోతూ ఇచ్చిపోయిన ఆస్తి తొట్లోపిల్లాడు. జడవేసుకునే రోజుల్లోనే మెడ బోసిదయింది. రాత కాలింది. ఏడవటానికి కన్నీళ్లుగూడా అప్పుతెచ్చుకోవలసిన స్థితిలో పసివాణ్ణి చూచుకుని నిట్టూర్చింది. గిలక్కాయరంగు చూచి నవ్వుకునే నాగభూషిని చూచి తానూ నవ్వాలా? పసుపూ, కుంకుమా పోయి ముసుగు నెత్తికొచ్చినందుకు ఏడవాలా?

పుట్టిల్లనేది ముళ్లకంచెలాంటిది. ఆడపిల్ల అత్తారింటి కెళ్లిందంటే చాలు, పుట్టిల్లు అంతంత అవడం ప్రారంభం అవుతుంది. అందులోనూ, అవతల సర్వమంగళం అయి, చమురుకాళ్ల మాతల్లి తిరిగి వొస్తోందన్నప్పుడు ఆడకూతురుకు జరిగే లాంఛనం ఎవరెరగనిది?

తల్లీ, తండ్రీ ఉంటేనన్నా కాస్త మెరుగు. తల్లీ తండ్రీ పోయాక, పుట్టింటి ఆపేక్ష ఆమడలంత దూరమూ అవుతుంది. దరిద్రంలో ప్రేమలు పిట్టలాగా ఎగిరిపోతై.

నాగభూషి నెత్తుకుని సీతమ్మ పుట్టింటికి వెళ్ళింది. ఇక్కడ చేసే చాకిరీ మరోచోట చేసుకుంటే — సాహంత్రం అన్నా ఉంటుందని తిరిగి రానూ వొచ్చే సింది.

కలిగిన మారాజుల యింట్లో వంటచేస్తూనో, దంపులు దంపుకొనో ఆమె జీవించ తలుచుకుంది. సరాసరి బస్తీచేరిందిరో అని అనిపించుకోతలచలేదు. బస్తీపక్కని ఓమాదిరి ఊళ్లో వుంటోంది. కర్ణంగారి యింట్లో వంటచేస్తోంది ప్రస్తుతం. వాళ్ల పిల్లలు చద్దన్నాల్లో పారేసినంత ఉండదు, నాగభూషికి పెట్టేది. కరణంగారి భార్య "సీతమ్మా, వాణ్ణికూడా ఇక్కడే తినిపిద్దూ" అని చెప్పింది. అక్కడే తింటూ ఊరిబళ్ళో చదువుకున్నాడు. దుడుకు వెధవ, ఎక్కడ వాళ్ళ పిల్లల్నీ, వీళ్ల పిల్లల్నీ ఏంచేస్తాడో, ఏ అల్లరిలో దెబ్బలుతిని వొస్తాడోనని కళ్లల్లో వొత్తులెట్టుకుని ఉంది.

"నే నేమైనా చదువుమానను" అని హఠం పట్టాడు నాగభూషి.

"బస్తీకి వెళ్లిరాగలవుట్రా?" అంటే 'ఓ' అని తలఊపాడు.

నిన్న మటుకు నిన్న మారాంపట్టి, డబ్బు తీసుకు వెళ్లాడు. బళ్లో పేరు చేర్పించుకున్నాడు. పుస్తకాలూ అవీ తెచ్చుకున్నాడు.

"అమ్మా, నే ఫౌంటెన్ కొనుక్కుంటానే-"

"ఎంతవుతుందీ?"

"మూడో, నాలుగో"

"పండక్కు కొనుక్కుందుగానిలే. ఇప్పుడు డబ్బు చాలొద్దూ మరి?"

సీతమ్మ చచ్చిచావని గొంతుకతో అంది ఆ మాట. నాగభూషి చిన్నబుచ్చుకున్నాడు.

"ఊఁ ఊఁ, కొనుక్కోవొద్దులే—"

"పండక్కు కొనుక్కోమని చెప్పాను గాదట్రా"

"మా క్లాసువాళ్లందరికీ ఉందే—"

సీతమ్మకు ఏమనాలో తోచలేదు. వాయిల్ సిల్కుజాకెట్టు కొనిపెట్టమని అడిగితే, తన తల్లి తనకేం చెప్పిందో జ్ఞాపకానికి వొచ్చింది. మొగుణ్ణి నోరువిప్పి అడగడమూ అయింది. 'నీఅందానికి అదొక్కటేనా తక్కువ'అని ఆ మహారాజుచేత అనిపించుకోడమూ అయింది అప్పటికి. తల్లి ఏమందీ? "పండక్కు చూద్దాంలే అమ్మా"అంది. పండక్కు తను యిక్కడ ఉండదు అని యిద్దరికీ తెలుసు. 'ఆనిక్కు చూద్దాంలే' అనడం 'వీల్లేదు'అనడానికి మరోమాట.

"పోనీ, కొనుక్కోరా"అంది సీతమ్మ కొడుకుతో.

"పండక్కు కొనుక్కుంటాలే—"

"ఇంత నిమిషంలో కోపంవొస్తే ఎట్లా, అప్పుడే అంత చిర్రూబుర్రూ ఏమిట్రో-వేలెడంత ఉన్నావో లేదో-ఎక్కడికి పోతై పోలికలూ?"

నాగభూషి చిన్నపుచ్చుకున్నాడు.

—ఇది నిన్న జరిగింది.

రాత్రిఅంతా తనకు యిదే గుంజాటన. నెలితి మాట ఎందుకంటినా అని సీతమ్మ చాలాసార్లు అనుకుంది. మరీమరీ నొచ్చుకుంది. ఇప్పుడేమనుకుంటే ఏంలాభం? నోరుదాటాక, మాటను వెనక్కు తీసెయ్యలేం.

కంచంలో అన్నం పెట్టి, కొడుకుదగ్గర కూచుంది సీతమ్మ. ఎప్పుడు వెళ్లిపడదామా అన్న తొందరలో నాగభూషికి అన్నం సయించడంలేదు. ముద్ద నోట్లోకి వెళ్లడంలేదు. నెమ్మదిగా ఆమాటా యీ మాటా చెబుతోంది.

"జాగర్త వెళ్లమ్మా. రోడ్డుకి ఓపక్కన నడూ. బళ్లూ, కార్లూ ఎక్కడ మీదపడతయ్యో. చూచుకుంటూ నడవాలీ."

"నడుస్తాలేవే"

"ముద్ద తినూ. దిక్కులుచూస్తావేం? పైపై పోటల్లా"

"మజ్జిగ పొయ్—"

"అప్పుడే—కాస్త నాలుగు మెతుకులన్నా తినక పోతే ఎల్లాగురా? ఏమిటా వేషం? తిను మరీ"

నాగభూషి మూత్తుడుచుకున్నాడు. నిక్కరూ, చొక్కా తొడుక్కున్నాడు. పుస్తకాలు తీసుకున్నాడు. వాటి నతడు నిన్న రాత్రే సర్ది ఉంచాడు.

"అమ్మా, వెళతానే—"

"యిది తీసుకెళ్లవూ?"

కరణంగారి భార్యను సీతమ్మ పాత టిఫిన్ కారీరు చిన్న దేదన్నా ఇమ్మని నిన్న అడిగింది. పొద్దున్నే తిని వెళ్లితే, సాయంత్రంగానీ తిరిగి యింటికి రాడామరి, యీలోగా ఎల్లా? కొందామంటే ఉన్న డబ్బంతా పుస్తకాలకూ, బళ్లో చేరటానికే అయిపోయిందాయె. అన్నం తీసికెళ్లటానికని అడిగింది. బుల్లి సత్తుకారియర్ తెచ్చింది. దానికి కొక్కెం విరిగిపోయింది. కొక్కెం లేదన్నమాట తప్ప, ఫరవాలేదు, పనికొస్తుంది. మనబోటివాళ్లకు సరికొత్తవి రమ్మంటే ఎల్లాగొస్తాయేం అనుకుంది ఆమె. తాడు ఒకటి తెచ్చి కొక్కానికి బదులు కట్టింది. దాన్ని శుభ్రంగా తోమింది. తోమేప్పటికి సత్తుముండ ధళధళా మెరుస్తోంది. దాంట్లోనే యింత అన్నమూ, మజ్జిగా కలిపి, నూరిన పచ్చడి కాస్త వేసి తెచ్చింది సీతమ్మ.

"మధ్యాన్నం ఎక్కడన్నా పెట్టుకుతినూ." అని చెప్పింది ఆమె. పొద్దోతోంది. కరణంగారింటి కెళ్లాలని ఆవిడా బయలుదేరింది. నాగభూషి కంటికన్నబడేవరకూ తల వెనక్కి తిప్పి చూస్తూనే వెళ్లింది. పిచ్చి వెధవ, తలకాయి వొంచుకుని రోడ్డుకు పక్కగానే పోతూన్నాడు.

గబగబా నడుస్తూ నాగభూషి స్కూలుకు చేరుకున్నాడు. అతనూ అడుగు పెట్టున్నాడు. ఠంగ్ ఠంగ్ మంటూ బళ్లో గంట కొడుతూన్నారు. ఇది మంచి శకునం. అడుగు పెడుతూండగా గంటకొట్టడం మంచిదని ప్రతివారూ చెప్తారు. శకునంగూడా కలిసి వొచ్చిన ఉత్సాహంతో అతను తొందరగా లోపలికి వెళ్లాడు. కొత్తగా స్కూలు తెరిచారు. అవాళనుంచే పాఠాలు చెప్పడం ప్రారంభిస్తారు. మాస్టర్లు నీట్‌గా వొచ్చివున్నారు. జ్యేష్ఠమాసమేమో ఎండ చెత్తమాడుస్తోంది.

కుర్రాళ్లు గబగబా నడుస్తున్నారు. టాక్‌టీక్‌గా ఉన్నారు. ఫాలాతుడు వొచ్చి ఆపినా ఆగేట్టు లేరు. ధక్‌ధక్‌ధక్‌మంటూ నడుస్తున్నారు. కేరింతాలాడుతూన్నారు. ఓచేత్తో పుస్తకాలూ, మరోచేత్తో ఇక్ష్వాకులనాటి సత్తుటిఫిన్ కారియరూ పుచ్చుకుని నాగభూషి వొచ్చాడు. చెమటకు చొక్కా తడిసిపోయింది. అడిగి తెలుసుకుని క్లాస్‌రూంలోకొచ్చాడు. ఇంకా మాస్టరు క్లాసుకు రాలా.

నలుగురు పిల్లలూ వొక్కసారి అతన్ని పరకాయించి చూచారు. ఫక్కున నవ్వారు. ఎందుకు నవ్వుతారో అతనికి తెలీలేదు.

'సత్తెప్పాలా' అన్నా డొకడు. మరి కొందరు తలెత్తి అతన్ని చూచారు. ఫక్కున నవ్వారు. నాగభూషికి అర్థమైంది. కోపం వొచ్చింది. తమాయించుకున్నాడు.

చివరిబల్లలూ, ముందుబల్లలూ నిండిపోయినై. మధ్యనే ఖాళీవుంది. ఓచోటికెళ్లి వారగా కూచున్నాడు. కాళ్లదగ్గిర కారియర్ పెట్టుకున్నాడు.

"సత్తెప్పాలా ఎంతకొన్నావ్?"

అడిగింది తోటివిద్యార్థి. చక్కగా,నలగని మల్లెపూవల్లే వున్నా డతను. నెమ్మదిగా అడిగాడు.

"నాకు తెలీదు. మా అమ్మ ఇచ్చింది."

"మంచిపనే చేసింది."

"ఏం?"

మాస్టరు క్లాసులోకొచ్చాడు. అల్లరి ఆగింది. పాఠం ప్రారంభించాడు. ముందు కాస్సేపు కొద్దిగా కబుర్లు చెప్పాడు. పాఠం ఎత్తుకున్నాడు. చెప్పిందేమీ లేదుగాని, చెప్పేవిధం బాగుంది.

క్లాసు అయింది. యింకో గదిలోకి పోవాలి. గంటకొట్టగానే అందరూ లేచారు. నాగభూషీ లేచాడు. అందరూ లేస్తుంటే తనూ లేచాడు. అన్నం

కారియరో? యిక్కడ ఉంచిపోతేనేం? రెండడుగులు వేశాడు. ఏమైపోతుందో ననిపించింది. వెనక్కి వెళ్లి దాన్ని తీసుకున్నాడు. ఇక్కడ పెట్టుకున్నట్లే అక్కడా పెట్టుకోవచ్చనుకున్నాడు.

ఇలాంటివి పెట్టుకోటానికి గది ఏమన్నా ఉందేమోననిపించింది. ఎవర్ని అడగడం? తలవొంచుకుని బయలుదేరాడు.

యిందాకా ఎంతకొక్కన్నావ్ అన్న అబ్బాయిని అడిగితే...ఏం అంటాడో, ఏం ఎక్కిరిస్తాడో, యిందాక నెమ్మదిగానే - ఎక్కిరించడం కానట్టే- అడిగాడే మరి. ముక్కూ మొహమూ తెలీకుండా ఎవర్ని అడుగుతాడు? పలకరించింది ఒక్కడే. అతన్నే అడిగాడు.

"అన్నాలగది ఏదన్నా ఉందా ఇక్కడ?"

"చద్దన్నాలగదేనా?"

"చద్దన్నం ఎందుకైందీ? తెచ్చుకొన్న అన్నం పెట్టుకుతినే గది!"

"చల్లారిన అన్నం చద్దన్నం కాదుటోయ్? చద్దన్నం అంటే కాదంటావేం?"

"సరేలే-చద్దన్నాలగది"

"అంత ఉక్రోషం ఎందుకోయ్ - చద్దన్నాలగదేగా"

నాగభూషి మాట్లాడలేదు. ప్రాణం చివుక్కుమంది; చూస్తున్నాడు. ఆకుర్రాడు ప్రసంగం వొదిలేసి తన పక్కనున్న విద్యార్థితో వేరే మాట్లాడుతూన్నాడు. నాగభూషికి చిన్నతనం వేసింది.

"చెప్పమంటే చెప్పవేమోయ్, గది ఎక్కడుందీ?"

"సోది అడుగు. తెలుస్తుంది!"

"లేనేలేదా"

"సొరాజ్యం వొస్తే చద్దన్నాలగది వొస్తుంది"

పక్కనున్న నలుగురూ నవ్వారు.

నాగభూషికి మరీ చిన్నతనం వేసింది. తల వొంచుకున్నాడు. వెనకటిలాగానే పక్కన పెట్టుకున్నాడు. వెధవకారీరు, కొక్కెమన్నా లేదు. తాడు కట్టిన కారీరు. ఎక్కిరిస్తారంటే వాళ్ల తప్పేముంది? ఏం, అన్నం తెచ్చుకోడం తప్పా? అన్నం తింటం తప్పా?

క్లాసులోకి వెళ్లి కూచున్నాడు. ఈ క్లాసులోనూ 'సత్తెప్పాలా' అనబడింది. అందరూ అతన్ని తలెత్తి తేరిపారచూట్టమూ అయింది. ఫక్కున నవ్వడమూ అయింది.

మాస్టరు వొచ్చాడు. క్లాసు ధణుతెగరగొట్టాడు. తన యావలో ఉన్నాడేమో కాస్సేపు నాగభూషికి అర్థంకాలేదు. తరువాత్తరువాత బోధపడింది.

అందరూ ఫౌంటెన్ పెన్నులు తీసి నోట్సు రాసుకుంటున్నారు. తను పెన్సలుతోటే రాసుకున్నాడు. ఇదీ చిన్నతనమే వేసింది. పండక్కి తనూ కొనుక్కుంటాడు. ముష్టికలం! గట్టిగా అడిగితే యివాళే కొనుక్కోమంటుంది అమ్మ! ఆమాటకొస్తే కొనుక్కోమనే అంది. తనే ఆగాడుకానీ—

బడి అయింది. బిలబిలలాడుతూ పిల్లలు బైటికొస్తున్నారు. ఆ గలభాలో అణిచినా అణగని ఉద్రేకమూ వుంది. ఆనందమూ వుంది. 'సత్తెప్పాలా!'- కొత్తనినాదం. కాశ్శేపటితో ఆ నినాదం ఐపోయింది. ఎవరి ఇళ్లకు వాళ్లు వెళ్లారు. బడిపక్కన ఉన్న పెద్ద అరుగులమీదికి నాగభూషి వెళ్లాడు. అతనికి ఆకలీ, అన్నం గుర్తుకురాలేదు. నిజానికి ఆకలి వెయ్యడమే లేదు.

మాస్టరు చెప్పింది నెమరుకువొస్తోంది. నోట్సు తీసి చూచాడు. టెక్స్టట్ పుస్తకాలు తీసిచూచాడు. చెప్పిందంతా కళ్లముందర ఆడింది. ఇప్పుడు తను ఎవరికైనాసరే తిరిగిచెప్పేయగలడు.

ఎండ మలమల మాడుస్తోంది. పన్నెండు కావొస్తోంది. అన్నం తిందామనిపించింది. తిందాంలే అని కాస్సేపు జాప్యంచేశాడు. చుర్రుమంటోంది ఆకలి. లేచాడు. పుస్తకాలు సర్దాడు. టిఫిన్ కారీరు మూత తీశాడు. మజ్జిగా అన్నమూనూ, కందిపచ్చడీ!

చేతులూ, కాళ్లూ కడుక్కుని తినేస్తే సరి. శారీరుకు మళ్లీ మూతపెట్టాడు. చేతులూ, కాళ్లూ ఎక్కడా కడుక్కోడం? పంపు ఎక్కడుందో? బడికి దగ్గర్లోనే పంపు వుంటుంది అని చెప్పిందే అమ్మ. ఎటుందో వెతకాలి.

ఇవి ఇక్కడపెట్టి ఎల్లా పోటం? రెండు చేతులతోనూ రెండూ పుచ్చుకుని బయలుదేరాడు. నెత్తి మాడుస్తోంది ఎండ. కింద కాళ్లు భగ్గుమంటున్నాయి. వొళ్లంతా తుకతుకలాడుతోంది. తన వొళ్లు తనకే అసహ్యంవేస్తోంది. పంపుదగ్గిరికి వెళ్లి కాళ్లూ, చేతులూ, ముఖమూ కడుక్కుంటేనేగాని తోచేట్టు లేదు. తిరిగి తిరిగి మళ్లీ మొదటికి వొచ్చాడు. పంపు కనబడలేదు. అరె! పక్క మలుపులోనే ఉంది పంపు. సూర్యుడు నడినెత్తికొచ్చాడు. కాళ్లుమాడుతూన్నై.

తనకు తెలీక కొట్టుకులాడాడుగానీ, పక్కనే ఉందే పంపు. అమ్మ అబద్ధం చెప్పదు. ఇందాకే ఏకుర్రాణ్ణన్నా కనుక్కుంటే చిక్కే వుండేదికాదు. బడిప్యూన్‌ను అడగాలిసింది. ఇప్పుడతనూ ఉండడు. అమ్మ ఏం అనుకుంటోందో? తన మాట మర్చిపోయి వుంటుంది. ఈపాటికి కర్ణంగారింట్లో అందరూ భోజనాలు చేస్తుంటారు.

పంపుదగ్గిరికి వెళ్లాడు. పంపు కట్టేశారు. నీటిచుక్క లేదు. ఎల్లా గబ్బా. ఈపంపేకట్టారా, అన్నీ కట్టేశారా? కొన్ని పంపుల్లో ఎప్పుడూ నీళ్లొస్తయ్యని అంటారే. యీపంపులో రావన్నమాట. మరేపంపులో వొస్తయ్యో? దాహం వేస్తోంది. గొంతుక పొడిఆరిపోతోంది. వొళ్లు అసహ్యంగా ఉంది. కాళ్లు మాడి, మంట బుర్రకెక్కుతోంది. అడుగులుపడడం లేదు. కానీ, ఆగలేదు. దబదబా ఉరుకులూ పరుగులూ పెట్టకపోతే నేలమీద నిలవడం కష్టం. చెరువంటూ ఉంటేనా ... టక్క దూకున వెళ్లి అందులోపడును తను. దాహం తాగడానికి గతిలేదు గానీ, చెరువు!

చేతిలో పుస్తకాలు తగ్గట్టు జారుతూన్నై. అల్లాగే ఆగాడు. సర్దుకొన్నాడు, కారియర్ పట్టుకుని పోతున్నాడు.

ఇంకోపంపు కనబడింది. ఏం లాభం? అదీ కట్టేశారు. తిరిగి తిరిగి మరోపంపూ చూచాడు. అదీ కట్టేశుంది.

ఎంగిలి విస్తరాకు కనబడింది. ఎవడోమరి, ఆవకాయముక్క కొరక్కుండానే పడేశాడు. నిమిషం నిదానించి ఆత్రంగా చూచాడు నాగభూషి. ఎండలో ఆవకాయముక్క మెరుస్తోంది. కాళ్లు బొబ్బలెక్కినట్టున్నై.

కాళ్లు ఇక ఆగటంలేదు. పంపుదగ్గిర ఉన్న మురుగుదగ్గిరికి వెళ్లాడు. కాళ్లు దాంట్లో పెట్టాడు. అమ్మ! కాస్త నయం. అదీ చుర్రుమంది. ఐతేనేం- కాళ్లకు తడి, తగిలిందిగదా. ఇక్కడా భగ్గుమన్నట్టు ఉంది. అబ్బో.

ఎవరినన్నా అడిగితే?

ఎవరినీ అడిగేది?

ఇందాకా బళ్లో ఏమైంది? మాటచెప్పటానికి అంత అల్లరయిందే...

"ఎవ్వరినీ ఏమీ అడగ్గూడదు. ప్రాణంపోతున్నా సరే" అంటుంది అమ్మ. నిన్నరాత్రిగూడా అనుకుంది.

"ఏమి టల్లా వెతుకుతూన్నావ్? దా. ఓశ్, మంచినీళ్లేగదా." అని ఎవరన్నా అనగూడదూ? ఎవరంటారు? అమ్మైతే అంటుంది. ఇక్కడ అమ్మ ఎదీ?

నాగభూషికి కళ్లల్లో నీళ్లుతిరిగై. మురిక్కాలవలో నుంచోటంగూడా కష్టం అనిపించింది. ఎవరన్నా చూస్తే నవ్వుతారు. నవ్వితే నవ్వారు. కాళ్లు మాడి చావటంకంటె మరేమీ కాదు అది. ఇక్కడగూడా ఏం బాగుండలేదు. ఆ బురదకాళ్లతోనే బయలుదేరాడు. ఇందాకటి అరుగులదగ్గిరికి వొచ్చాడు. పుస్తకాలూ, కారియరూ అక్కడ పెట్టాడు. 'అబ్బ' అనుకున్నాడు. కాశ్సేపు పడుకుందా మనిపించింది. ఆ అరుగుమీదే పడుకున్నాడు. ఇటూ అటూ దొర్లాడు. మరింత దుమ్ము వొంటికి అంటుకుంది.

ప్రాణం సొమ్మసిలిపోయింది. రివ్వున గాలి వెచ్చగా తగిలింది. నిద్రపట్టింది. దుంగలాగా పడుకుని

నిద్రపోయాడు. ప్రాణం సొరేసుకుపోయి నిద్రపట్టింది. మెలుకువ వచ్చింది. గంట కొడుతూన్నారు. బద్ధకంగా వుంది. పిల్లలు పోతూన్నారు. అడుగో యిందాకటి అబ్బాయీ వెళుతున్నాడు. నాగభూషి నెమ్మదిగా లేచాడు. వొళ్లంతా దుమ్ముకొట్టుకునుంది. కన బడ్డమేరకు చేత్తో రాచాడు. చొక్కా అసహ్యంగా వుంది. ఉంటే ఉందిలే అనుకున్నాడు. పుస్తకాలు తీసుకున్నాడు. సత్తుటిఫిన్ కారియర్‌ను చూస్తే అసహ్యంవేసింది. దిక్కుమాలిన సత్తెప్పాలా! అమ్మ ఇచ్చింది. అమ్మ ఏమనుకుంటోందో. యీపాటికి అమ్మ కరణంగారి వసారాలో చెంగుపరుచుకుని పడుకుంటుంది.

పుస్తకాలూ, కారియరూ రెండుచేతుల్లోనూ పట్టుకొని బయలుదేరాడు. వొళ్లు తేలిగ్గా, నీరసంగా ఉంది.

క్లాసుకు వెళ్లాడు. చిత్రంగా ఉంది. పొద్దుటిగదేనా ఇది. కారియరు మామూలుగా పెట్టాడు.

క్లాసు జరుగుతోంది. పాఠాలు విన బుద్ధిపుట్టడంలేదు. చిత్రం, ఇందాక అంత దాహం వేసిందా, ఇప్పుడు దాహమే లేదు. అన్నం తినలేదే అన్నది మనస్సును మహా వేధిస్తోంది. క్లాసులో ఏం జరుగుతోందో తెలియదు. ఉడికిన బంగాళాదుంపలాగున్నాడు తను. చెప్పిన పాఠం బుర్రకెక్కలేదు. గంటకొట్టారు.

వికారంగా ఉంది. లేచిపోదామా అనిపించింది. ఏమైనా సరే అని చదువుకోవచ్చాడు తను. బాగానే వుంది కథ. లేచిపోతే ఎలా?

క్లాసులో చెప్పేది వినబడీ వినబడనట్టుగా ఉంటోంది. కళ్లు మూసుకున్నాడు. కళ్లముందు పచ్చపచ్చగా, ఎర్రెర్రగా, మసకలుమసకలుగా కనబడుతూన్నై. కళ్లు తెరిచాడు. క్లాసు అయింది.

దాహం తాగాలి. పక్కమలుపులోని పంపు దగ్గిరికి వెళ్లాడు. నీళ్లు వొచ్చె. కాళ్లు తడుపుకున్నాడు. ఆత్రంగా పొట్టపట్టినన్ని నీళ్లు తాగాడు. తలా, చేతులూ, కాళ్లూ తడుపుకొన్నాడు. ఆ చొక్కాతోనే మొహం తుడుచుకున్నాడు. తన వొళ్లు తనకు తుప్పుకంపు వేస్తోంది.

మళ్లీ క్లాసులోకి వొచ్చాడు. క్లాసు కుచ్చిటప్పాలతోటి నడుస్తోంది. అన్నంమీదికి కన్నుపోయింది. అన్నం తినాలని అనిపించలేదు. క్లాసు మామూలుగానే జరిగింది.

తప్‌తప్‌మంటూ కేరింతాలాడుతూ కుర్రాళ్లంతా బయలుదేరారు.

ఆటలకని కొందరు గ్రౌండ్సులోకి పోబోతున్నారు.

"నువ్వుగూడా వొస్తావా?"

పొద్దుటికుర్రాడు కాడు, మరొకడు.

"ఉఁహు. రాను"

"ఏం అల్లా నూతిలో పడ్డట్టు మాట్లాడుతూన్నావ్?"

నాగభూషి మాట్లాడలేదు.

"గేమ్సుఫీ కట్టలా నువుమాత్రం"

నాగభూషి తల ఊపాడు.

"సత్తెప్పాలాగాడితో ఏమిట్రా" అంటూ మరో కుర్రాడు వచ్చి, చూడకఅన్నట్టు నటించాడు. మాట్లాడుతూన్నకుర్రాడు నవ్వాడు.

కొత్తకుర్రాడు నీ పేరేమిటన్నాడు. నాగభూషికి కోపం వొచ్చింది. 'సత్తెప్పేలా' అన్నాడు.

'భేష్' అని ఇద్దరూ చక్కాపోయారు.

తన్ను ఎగతాళిచేశారన్న మంట దహించుకు తింటోంది. పంపుల్లో నీళ్లు కావలిసినన్ని. ఎందుకు, తగలెయ్యనా, వెధవనీళ్లు. ప్రాణం పోతూన్నా బొట్టు పడలేదు. అక్కర్లేనప్పుడు ఇబ్బడీ, ముబ్బడీ.

కాళ్లు ఊరికే నములుతూన్నై. ఒళ్లంతా పచ్చిపుండల్లే ఉంది. చేతిలో ఈ కారియరు బరువొకటీ.

తల వొంచుకుని నడుస్తూన్నాడు. రోడ్డుకు వొకపక్కనే నడవలేకపోయాడు. అడుగులు తేలుతూన్నై. మనిషి తూలుతూన్నాడు. కాస్సేపు

రోడ్డుకు ఓ చివరా, మరికాస్సేపుకు రోడ్డుమధ్యనా, యింకాస్సేపటికి అవతలిపెడనూ నడుస్తున్నాడు. ఇదే మిటీ, యీ చివరికి వొచ్చానూ అని అనుకుంటున్నాడు. మరికొంచెంసేపటికి అద్ధరిని అడుగులేస్తున్నాడు. ఎవరో కత్తుకట్టి సాధిస్తున్నప్పుడు పీడితుడున్నట్టు ఉన్నాడు నాగభూషి.

నాగభూషికి తల్లి కళ్లక్కనబడ్డది. అమ్మ ఏంచేస్తోందో? తననుగురించి ఏమనుకుంటోందో...?

అందరికీ వడ్డనచేసింది సీతమ్మ. కొడుకు కళ్లల్లో మెదిగినట్లు అయింది ఆమెకు. విస్తరేసుకుని అన్నం ముందు కూచుందన్నమాటేగాని ఆవిడకు అన్నం సయించలేదు. అన్నహితవు తప్పినట్లు అయింది. నాగభూషి జాగర్తగా చేరుకున్నాడో, ఏమన్నానో... పసివెధవ అంతమందిలో బిక్కమొహం వేసుకుని ఏమాతున్నాడో...అన్నం తిన్నాడో, లేదో...? సీతమ్మకు ముద్ద నోటికెక్కలేదు. గోడకేసి అల్లాగే చూస్తూ కూచుంది. ఏమిటేమిటో జ్ఞాపకం రాసాగినవి. ఆ ప్రవాహంలో పడి ఆమె ఉక్కిరిబిక్కిరి అయింది.

"సీతమ్మా! ఏం చేస్తున్నా"—ఆమెకు వినబడ లేదు.

"ఇదుగో, నిన్నే—"

తలెత్తింది. కరణంగారి భార్య. చప్పున స్పృహ తెచ్చుకుంది. "అన్నంతింటున్నా"నంది. బొంకింది అలా. చిన్నచిన్న తప్పులు పట్టుబడ్డప్పుడే బొంకటం జరుగుతుంది.

"మరేం లేదుగానీ, మరిచిపోయి మైలపడకు. కందులు వేయిద్దుగాని" అంది కరణంగారి భార్య.

"అయ్యో! సరే—"

"ఏం, వేరే ఏమన్నా పనుందా?"

"అబ్బే! ఆమాట తెలిస్తే వేయించే కూచునే దాన్ని. అన్నం తిన్నబట్ట గదా అని చూస్తున్నా..."

"మరేం ఫరవాలేదు లెస్తూ. మడిబట్టేగా" అని వెళ్లింది కరణంగారి భార్య. మళ్లీ తిరిగి వొచ్చింది.

"ఇందాకా కందులు తడిపి ఆరబోయించానూ. మరిచిపోబోకూ" అని చెప్పిరిది. దర్జాగా సావిట్లోకి వెళ్లిపోయిందామె.

సీతమ్మకు తోచలేదు. అన్నంముందు కూచోటం కాలే కాలే పెనమ్మీద కూచున్నట్టుంది. మూత్తుడుచుకుంది. మంగలం ముందేసుకు కూచుంది.

ఆలోచనలకూ, అగ్నిహోత్రుడికీ సయ్యోగ్యత్ల్లే ఉంది. నిప్పు కణకణమంటూన్నకొద్దీ ఆలోచనలు అతివేగంగా వొస్తై. కేపు ఎక్కడ ముదరవేగుతుందో...కాటోతుందని ఆమె ఎంత వొళ్లు దగ్గిర పెట్టుకున్నా పంచప్రాణాలూ పిల్లాడిమీదే ఉన్నై.

దిక్కుమాలిందాన్ని, యీ చాకిరీ ఆ ఊళ్లో నేనా కుదుర్చుకున్నాను గాదు అనుకుంది. పోనీ, నలుగురితో చెప్పిపెట్టో, రెండుమూడురోజులు తిరిగో అక్కడే పనిచూచుకుందామా అనుకుంది. ఊరు కదలడమంటే మళ్లీ మనస్కరించలేదు. యీ మల్లాగుల్లాలు పడడం ఇదెన్నోసారో...యిల్లా రోజూ మల్లాగుల్లాలు పడడమేనా అనుకుంది. అక్కడికి పోక తప్పదనుకుంది. కరణంగారేమంటారో...పనిమానుకునిపోయేది ఎల్లాగో పోతుంది అనుకుని, ఏదన్నా అభాండం మీద పడెయ్యరుగద. ఛ! చెప్పివెళితే ఏందుకేస్తారూ?

పోదాంపోదా మనుకోటమేగాని పోగానే అక్కడ దబ్బున పనంటూ కుదురుతుందా అనుకుంది.

ఏమైనాసరే, యిక్కడినుంచి పని మానుకుని పోనని తేల్చుకుంది.

సీతమ్మకు నవ్వువొచ్చింది. ఫదేళ్లు చేసిన యింట్లోంచి పోవాలంటేనే యింత హైరానపడుతోందే–అన్నేళ్లున్న జీవుడు లేచిపోవాలనుకుని, అంత హైరానపడతాడుకాబోలు అనిపించింది. నవ్వింది. వొడిలిపోయిన పువ్వు ఆ నవ్వు. పప్పు ముదర వేగింది. దబదబా దించింది. మళ్లీ యింకోవాయ వేసింది.

పాపం, వారు పోయేనాడు రాత్రి భళ్లున తెల్లవారింది. తెల్లవార్లూ వారు మహా యమచరపడ్డారు.

యింకాస్సేపటికి భూశయనం చేస్తారనగా, "సీతా!" అని పిల్చారు.

"సీతా!"

"వో య్-దగ్గిరే ఉన్నా"

"మాట"

ఆమె దగ్గిరిగా వెళ్లింది. "మరేం లేదు. మాట దక్కింది. (ఐపోయింది అనర్థం) ఆధారంలేనివాళ్లం. పిల్లాడు జాగర్త."

మళ్లీ మగతకమ్మింది. బద్దలయ్యేట్టు లాంతర వెలుగుతూన్నా, చిమ్మచీకటి అయిం దప్పుడు తనకు. "పిల్లాడు జాగర్త అన్నారు" అనుకుంది.

రాత్రికి వంట చేస్తోంది సీతమ్మ.

"అమ్మా!"

తలెత్తి చూచింది. నాగభూషి కాదు. పని వాడు. కరేపాకు తెచ్చియిచ్చి వెళ్లిపోయాడు. యింకా నాగభూషి రాలేదు. ఆమెకు ఉద్దూకుడుచుకున్నట్టుగా ఉంది. తను పెద్దదయ్యేదాకా ఎల్లాగన్నా యీడ వొచ్చు. వాడు దబదబా పైకివస్తే యీ యాతన తప్పుతుంది అనుకుంది.

"అమ్మా!"

నాగభూషే. "ఏరా, ఆలిశ్యంగా ఒచ్చావ్" అంది. దబదబా చెయ్యి తెరిపిచేసుకుంది. యివతలికి వొచ్చింది. పిల్లాడి మొహం వాడిపోయివుంది.

"అమ్మా!"

నాగభూషికి ఏడుపు ఆగలేదు. వెక్కి-వెక్కి ఏడుస్తున్నాడు. తల్లిని వాటేసుకున్నాడు. "నే బళ్లోకి పోనే—" అన్నాడు ఏడుపు దిగమింగుతూ.

"ఏంరా" అంది ఆదుర్దాగా. వేరే మడిబట్ట లేదనీ, మైలపడుతున్నాననీ ఆమెకు తట్టనేలేదు. కొడుకును పొదివిపట్టుకుంది.

"చంపినా సరే-నేను పోనే-" అన్నాడు నాగభూషి, ఏడుస్తూనే. ఈసారి అతను దుఃఖాన్ని మింగలేకపోయాడు. 'నేను పోనే' అని బావురుమన్నాడు.

